# చంద్రబాబు నాయుడు ప్రజలకు ఇచ్చిన ప్రతి హామిని అమలుచేస్తారు

**కర్నూలు హాస్పిటల్, జూన్ 13, ప్రభాతవార్తః** తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రజలకు ఇచ్చిన ప్రతి హామిని నెరవేరుస్తారని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు తెలియజేశారు. గురువారం జిల్లా టిడిపి పార్టీ కార్యాలయంలో నగర పార్టీ అధ్యక్షులు నాగరాజు యాదవ్‌లతో కలిసి మీడియాతో మాట్లాడుతూ ముఖ్య మంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన నారా చంద్రబాబు నాయుడు గురువారం బాధ్యతలు



స్వీకరించిన సందర్భంగా ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామి మేరకు ఐదు ఫైళ్ళపై సంతకాలు చేసి ఇచి ్చన మాటను నిలుపుకున్నారని పేర్కొన్నారు. ఇందులో ప్రధానంగా డిఎస్సీ ఫైల్‌పై తొలి సంతకం చేశారని తెలిపారు. జగన్ ప్రతి జనవరి నెలలో జాబ్ క్యాలెడర్ విడుదల చేస్తానని మాట ఇచ్చి విస్మరించారని జగన్‌రెడ్డిలా కాకుండా ఇచ్చిన హామి మేరకు చంద్రబాబు డిఎస్సీపై తొలి సంతకం చేశారని పేర్కొన్నారు. అన్నక్యాంటిన్లు పునరుద్ద రిస్తామన ్న హామిని నెరవేరుస్తున్నారని పేర్కొన్నారు. జగన్‌రెడ్డిలా ప్రజలకిచ్చిన హామిలన తుంగలో తొక్కెలవాటు చంద్రబాబుకు లేదని జగన్‌మోహన్‌రెడ్డి నిరంకుశ పాలనతో విసిగిన ప్రజలు చంద్రబాబుపై నమ్మకంతో తిరుగులేని మెజార్టీ ఇచ్చి గెలిపించుకున్నారన్నారు. నేడు రాష్ట్ర మంత్రిగా కర్నూలుకు రానున్న టీజీ భరత్‌కు ఘనస్వాగతం పలికేందుకు పార్టీ శ్రేణులంతా నగర సరిహద్దులోని సుంకేసుల రోడ్డు సెయింట్ జోషఫ్ కళాశాల వద్దకు తరలిరావాలని కోరారు.


కర్నూలు | నంద్యాల
వార్త
14 జూన్, 2024 గురువారం పేజీలు 4


## బాధ్యతలు చేపట్టిన బాబు.. 16347 మంది జీవితాలకు వెలుగు..!



**నంద్యాల, జూన్ 13, ప్రభాతవార్తప్రతినిధి:** ఇచ్చిన మాటకు కట్టుబడి ముఖ్య మంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే తొలిసంతకం మెగా డియస్సిపైనే మాట ప్రకారం 4.42నిమిషాలకు తొలిసంతకం చేసి 16347మంది ఉపాద్యాయుల జీవితాలకు వెలుగు చూపిస్తూ మార్గం సుమగం చేశారు. రాష్ట్రముఖ్యమంత్రిగా నారాచంద్ర బాబునాయుడు గురువారం సాయంత్రం 4.41నిమిషాలకు 1వ బ్లాక్‌లో ముఖ్య మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం వెంటనే మెగా డియస్సిపై తొలిసంతకం చేశారు. ఈ డిఎస్సీ ద్వారా 16,347 టీచర్ పోస్టుల భర్తీకి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇందులో స్కూల్ అసిస్టెంట్ 7,725 పోస్టులు, సెకండరీ గ్రేడ్ టీచర్ పోస్టులు 6,371 పోస్టులు, టీజీటీ పోస్టులు 1,781, పిజిటీ పోస్టులు 286 పోస్టులు, ప్రిన్సిపాల్స్ 52, పిఈటి 132 పోస్టులను భర్తీ చేయనుంది. అలాగే రెండవ సంతకం ముందుగా చెప్పిన విదంగా రైతుల భూమిలు పరాయి వారి సొంతము కాకుండా ల్యాడం టైటిలింగ యాక్ట్ రద్దుపై రెండవ సంతకము పెట్టి రాష్ట్రంలో ఉన్న లక్షాలాది మంది రైతులకు విముక్తి కలుగ చేశారు నేటికి మీకు సంబందించిన పాత పాస్ పుస్తకాలతో మీరు మీ ఇంటివద్దనే క్షేమం ఉండవచ్చు నిన్నమొన్నంటి వరకు మా భూములు మా పేరు మీదకాకుండా ఎవరి పేరున ఉన్నాయో అంటు దిబ్బలకు దిగాలు చెందిన రైతన్నలకు ఎన్నికల సమయంలో చంద్రబాబు ఇచ్చిన మాట మాట ప్రకారము టైటిలింగ్ యాక్టును రద్దు చేశారు దీనితో రైతులు గుండెనిండా నిబ్బరముతో జీవించడానికి చంద్రబాబు మార్గం సుగుమం చేశారు. దీనితో రాష్ట్రంలో ఉన్న లక్షలాది మంది రైతులు ముఖ్యమంత్రికి కృతజ్ఞ తలు చెప్పారు..అలాగే ఎన్నికలక సమయంలో జూలై నెలలో 4000వేల పంచనుతో పాటు ఎప్రిల్, మే, జూన్ మాసాల 3000పింఛనుతో కలిపి మొత్తం రూ 7000పంపిణీకి కూడా సంతకము చేపి అవ్వతాత మోములో చిరునవ్వు వెలిగింప చేశారు వీరితో పాటుదివ్యాంగులకు రూ 6000పించను పంపినీకి కూడా సంతకముచేశారు,అలాగే స్కిల సెన్సెస్ అన్న క్యాంటీన్ల ఏర్పాట్లుపై సంతకాలు చేశారు.

## ప్రభుత్వ ఆసుపత్రిలో.. డాక్టర్ల మధ్య కోల్డ్ వార్..!

- మహిళలకు చిన్నారులకు మాత్రమే వైద్యం అందిస్తానంటున్న ఓ డాక్టర్
- ఇబ్బందులు పడుతున్న రోగులు
- ఆందోళనలో వైద్య సిబ్బంది
- డాక్టర్ల మధ్య తీవ్రస్థాయికి చేరుకుంటున్న అంతర్గత విబేధాలు

**మండల కేంద్రమైన చాగలమర్రిలోని సర్వజన ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రజలకు, రోగులకు మంచి వైద్యం అందించాల్సి ఉంది. మండల పరిధిలోని 33 గ్రామాల పరిధిలోని ప్రజలకు ప్రభుత్వ వైద్యశాల వైద్యం అందిస్తుంది. ఇదికాక వైఎస్సార్ కడప జిల్లా సరిహద్దు ప్రాంతాలైన గోపల్లె, నారాయణపల్లె, ఇడమాడక తదితర గ్రామాల ప్రజలకు ఈ ఆసుపత్రి అందుబాటులో ఉంది. ప్రభుత్వం అధిక జనాభాను దృష్టిలో ఉంచుకుని జిల్లా సరిహద్దు అయిన చాగలమర్రిలో ఈ ఆసుపత్రిని ఏర్పాటు చేయడం జరిగింది.**




**చాగలమర్రి ,జూన్ 13, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన చాగలమర్రిలోని సర్వజన ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఇద్దరు డాక్టర్లను ప్రభుత్వం నియమించింది. ఆసుపత్రికి వచ్చే రోగులకు ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్తే అధిక ఫీజులు వసూళ్లు చేస్తున్నారన్న ఉద్దేశ్యంతో ప్రభుత్వ ఆసుపత్రికి రోగుల సంఖ్య పెరిగింది. కాని ఇక్కడ ఇద్దరు డాక్టర్లు ఉన్నా వారి మధ్య అంతర్గత విబేధాలు పెరిగి మహిళలకు, చిన్నారులకు మాత్రమే వైద్యం అందిస్తానని ఓ డాక్టర్ కరఖండిగా చెప్పడం వల్ల ఒక డాక్టర్ మీటింగ్‌లకు వెళ్లినప్పుడు రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. డాక్టర్ ఉన్నా ఓపీని మధ్యలో నిలిపివేసి ఆ డాక్టర్ దగ్గరకే వెళ్లాలని తిప్పి పంపడం జరుగుతుంది. ఆ డాక్టర్‌కు పనిభారం ఎక్కువ కావడం, ప్రభుత్వ కార్యక్రమాలకు ఆ డాక్టరే వెలుతుండంతో వైద ్య చికిత్సలు కుంటుపడు తున్నాయి. కేవలం మహిళలకు, చిన్నారులకు మాత్రమే నేను వైద్య ం అందిస్తానని పురుషులకు, వృద్దులకు ఆ డాక్టర్ వద్దకు వెళ్లాలని ఇక్కడ ఉన్న మహిళ డాక్టర్ అంటున్నారని ఆసుపత్రికి వస్తున్న రోగులు వాపోతున్నారు. ఒకవేళ రెండవ డాక్టర్ లేకపోతే నాకు వైద్యం ఎవరు అందిస్తారని ఒక డాక్టరై ఉండి అలా చెప్పడం సరికాదని అక్కడికి వచ్చిన రోగులు వారిస్తున్నప్పటికి చికిత్సలు మాత్రం చేయకపోవడం గమనార్హం. ఆ డాక్టర్ సమయపాలన కూడా పాటించడంలేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇద్దరు డాక్టర్ల మధ్య అంతర్గత కోల్డ్ వార్ జరుగుతుండడంతో రోగులు, అక్కడ పనిచేసే వైద ్య సిబ్బంది ఆందోళనకు గురవుతున్నారు. ఒకనొక దశలో వైద్య సిబ్బంది పై కూడా కక్షసాధింపులు సాధిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. జిల్లా వైద్యాఆరోగ్య శాఖ అధికారులు చర్యలు చేపట్టకపోతే విబేధాలు తీవ్ర స్థాయికి చేరే అవకాశం ఉందని పలువురు రోగులు చర్చించుకుంటున్నారు.

## జగన్ ఫోటో ఉన్నా.. చంద్రబాబు కాదనలేదు

**- కిట్‌లు పంపిణి చేయాలి**

**నంద్యాల విద్య, జూన్ 13, ప్రభాతవార్త ః** పాఠశాలలు ప్రారంభం అయా ్యయి. విద్యార్థులకు కిట్‌లు పంపిణి చేయాల్సి న సమయం అసన్నమయింది. ఇప్పటికే అయా పాఠశాలలకు విద్యార్థులకు సంబంధించిన కిట్‌లు, పాఠ్యపుస్తకాలు చేరుకున్నాయి. అయా కిట్‌లపై మాజీ సిఎం జగన్ ఫోటో ఉన్నా ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నికిట్‌లను యధావిధిగా పంపిణి చేయాలని అదేశాలు జారీచేశారు. చంద్రబాబు పాలనలో కక్షసాధింపు పగ నిర్ణయాలు ఉండవని టిడిపి ట్వీట్ చేశారు. 2019 సమయంలో ఎన్నికైన ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి చంద్రబాబుకు పేరు వస్తుందని అన్న క్యాంటిన్లను రద్దుచేశారు. ప్రస్తుత ముఖ్యమంత్రి చద్రబాబు నాయుడు ప్రజాధనం వృధాకారాదని పాలనలో పగ ప్రతీకారాలకు చోటు ఉండరాదని జగన్ బొమ్మ ఉన్న స్కూల్ పిల్లల కిట్‌లను అలాగే పంపిణి చేయాలని అదేశించారు. కిట్‌లకు సంబంధించి పాఠ్యపుస్తకాలతో పాటు షూష్, డిక్షనరీలు, మూడ జతల యూనిఫాం బట్టలు అందజేయాలని అదేశించారు.



## సచివాలయం.. అన్న క్యాంటిన్‌గా మారేనా ?



**నందికొట్కూరు, జూన్ 13, ప్రభతవార్త:** పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ సమీపంలో అప్పటి తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం లక్షలాధి రూపాయలతో అన్న క్యాంటిన్ నూతన భవనాన్ని నిర్మించి ప్రారంభించేలోగా వైసిపి ప్రభుత్వం రావడంతో అది నిలిచిపోయింది. వైసిపి ప్రభుత్వం అందులో 6వ సచివాలయ కార్యాలయాన్ని ఏర్పాటు చేసింది. ఇటీవలే అధికారం చేపట్టిన తెలుగుదేశం పార్టీ రాష్ట్రంలో అన్న క్యాంటీన్లను పున:ప్రాంభిస్తామని ముఖ్యమంత్రి సంతకం సైతం పెట్టడంతో పేదలు హార్షం వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలో అందరికి అందుబాటులో నిర్మించిన భవనంలో సచివాలయం కొనసాగిస్తారా లేక అందులో అన్న క్యాంటీన్ ఏర్పాటు చేస్తారా అనేది చర్చనీయాంశమైంది.

## రైతు ఆత్మహత్య..!

**మిడుతూరు, జూన్13, ప్రభాతవార్త;** మండలంలోని దేవనూరు గ్రామానికి చెందిన రైతు రఫీ గురువారం తన ఇంట్లో క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడు తనకున్న పొలంతో పాటు కౌలుకు పొలం తీసుకుని సాగు చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. అయితే సరైన వర్షాలు లేక పంటలు పండక పెట్టిన



(ఫైల్ ఫోటో)

పెట్టుబడులు రాక తీవ్ర మనోవేదనకు గురవుతూ ఉండేవాడని కుటుంబ సభ్యులు తెలిపారు. తనకున్న అరకొర పొలం అమ్మి అప్పు కట్టే ప్రయత్నం చేయగా, స్థానికంగా మల్లికార్జున రిజర్వాయర్ నిర్మాణం జరగబోతున్నట్లు ప్రచారం కావడంతో పొలాలు కొనేవారు కరువయ్యారని, అతి తక్కువ ధరకు పొలాలు కొనుగోలుకు పలువురు ముందుకురావడంతో ఉన్న పొలం అమ్ముకోలేక అప్పు కట్టలేక ఆత్మహత్యకు పాల్పడినట్లు కుటుంబీకులు వాపోయారు. ప్రభుత్వం స్పందించి అప్పుల బాధ తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడిన తమ కుటుంబాన్ని ఆదుకోవాలని కుటుంబీలు కోరారు. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## మద్యం ప్యాకెట్లు ట్రాక్టర్‌తో తొక్కివేత

**క్రిష్ణగిరి, జూన్13, ప్రభాతవార్త**

వివిధ కేసుల్లో పోలీసులకు పట్టుబడిన మద్యం ప్యాకెట్లను పోలీసులు గురువారం ట్రాక్టర్‌తో తొక్కించి ధ్వంసం చేశారు. యస్.ఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం 14 కేసులలో సీజ్ చేయబడిన 7969 టెట్రాప్యాకెట్లు, మరియు 60లీటర్ల నాటుసారాయిను పత్తికొండ డి. యస్.పి సమక్షంలో ట్రాక్టర్‌తో తొక్కించి ధ్వంసం చేశారు. వీటి విలువ సుమారు 4,50,000 ఉంటుందన్నారు. ఎవరైన మద్యం తయారు చేసిన విక్రయించిన నేరం అన్నారు. ఇటువంటి వారిపై క్రిమినల్ కేసులు కూడ నమోదు చేస్తామన్నారు. ప్రజలు పోలీసులకు సహకరించాలన్నారు. సమాచారం ఇచ్చిన వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.



## ప్రభుత్వ వైద్యశాలలో.. స్వాగతం పలుకుతున్న సమస్యలు

: మంచినీటి సమస్య, ఎక్స్‌రే ప్లాంట్, మౌళికసదుపాయాలపై దృష్టి సారించేనా
: చినుకు పడితే నూతన ఆసుపత్రి అంతా పోటుకు మయం
: 30 పడకల ఆసుపత్రి అభివృద్ధి ఇదేనా
: సంవత్సరాల కాలం నుంచి ఉన్న సమస్యలు టిడిపి ప్రభుత్వంతో సాధ్యమేనా




**ఆత్మకూరు జూన్13, ప్రభాతవార్త:** సామాజిక ఆరోగ్య కేంద్రంలో ప్రభుత్వాలు మారీన సమస్యలు నేటికి తీరడం లేదు. చుట్టు మండలాల పరిధిలోని గర్భవతులు, బాలింతలు ఇతర రోగులు ఈ వైద్యశాలను సందర్శిం చాల్సి ందే. ఇటివలే వైసిపి ప్రభుత్వంలో చేపట్టిన నూతన ఆసుపత్రి ప్రారంభం చేసి కొన్ని నెలలకే వర్షాకాలంలో వైద్యశాల అంతా చినుకుపడితే పోటుకు తప్పడం లేదు. ముఖ్యంగా రోగులకు మంచినీటి సమస్య, ఎక్స్‌రేప్లాంట్, అత్యావసర పరిస్థితులలో మౌళిక వైద్య సదుపాయాలపై నూతన ప్రభుత్వానికి సమస్యలు స్వాగతం పలుకుతున్నాయి. సమస్యల వలయంలో తలడిలిపోతున్న ప్రజలకు నామమాత్రమే సౌకర్యాలు ఉన్నాయి. ముఖ్యంగా త్రాగడానికి మంచినీటి వసతి లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నూతన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలలో ఉన్న సమస్యలను పరిష్కరించే విదంగా అధికారులు ప్రత్యేక చొరవ తీసుకునేనా అనిపలువురు ప్రజా సంఘాల నాయకులు వాపోతున్నారు. ముఖ్యంగా కొత్తపల్లి, పాములపాడు, ఆత్మకూరు మండలాల పరిధిలోని కమ్యూనిటి హెల్త్ క్లస్టర్‌గా 30 పడకల ఆసుపత్రిని నాడు నేడు పనుల క్రింద దాదాపు రూ.1.20కోటితో కొంత హంగులతో వైద్యశాలను నిర్మించారు. అయితే ముఖ్యంగా గర్భవతులకు, బాలింతలకు, చిన్నపిల్లలకు అక్కడా ఉండే బందువులకు సొంత బొర్లు, ఆసుపత్రిలో లేకపోవడంతో కేవలం మున్సిపాలిటి నీళ్ళపై వైద్యశాల ఆధారపడి ఉందని చెప్పవచ్చు. సొంతంగా వైద్యశాలలో బొర్లు ఏర్పాటు చేసి మౌళిక వైద్యసదుపాయాలు కల్పిస్తే ఈప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్యంను అందించే విదంగా వైద్యాధికారులు అన్ని చర్యలు చేపట్టేందుకు ముందున్నారు. అయితే గత ప్రభుత్వంలో పాలకులు తప్పిదాలతో ఈ వైద్యశాల అభివృద్ధి కుంటుపడిందని చెప్పవచ్చు. సుదూరా ప్రాంతాల నుంచి వచ్చే రోగుల బందువులకు కనీసం బోజన వసతులు చేసేందుకు కూడా బోజనశాల గది లేకపోవడం విడ్డురం ఎక్కడా పడితే అక్కడా రోడ్లపైన బోజనాలు చేసి కాలం గడుపుకుంటున్నారు. ఆత్మకూరు రెవెన్యూ డివిజన్ ఏర్పడడంతో ఈ వైద్యశాలను ఏరియా ఆసుపత్రిగా గుర్తించి 100పడకల వైద్యశాలగా టిడిపి ప్రభుత్వం తీర్చిదిద్దుతే చెంచు గిరిజన గూడెల నుంచి గ్రామీణ ప్రాంతాలు, పట్టణాల ప్రజలకు అన్ని వేళలలో వైద్యమౌళిక సదుపాయాలు కల్పించి అన్ని విదాలుగా ప్రభుత్వ వైద్యశాలను అభివృద్ధి చేసుకోవచ్చని పలువురు ప్రజానీకం వాపోతున్నారు. ఇప్పటికైన టిడిపి ప్రభుత్వం ఈ వైద్యశాలలో ఉన్న సమస్యలను పరిష్కరించి రోగులకు, ప్రజలకు మౌళిక సదుపాయాలు కల్పించే విదంగా ప్రజాప్రతినిధులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

## కొలిమిగుండ్ల మండలంలో 6.2 మి.మి. వర్షపాతం నమోదు



**కొలిమిగుండ్ల, జూన్ 13, ప్రభాతవార్తః** కొలిమిగుండ్ల మండల పరిధిలోని తదితర గ్రామాల్లో మంగళవారం రోజు 6.2 మి.మి. వర్షపాతం నమోదు అయినట్ల ఏఎస్ఓ భాస్కర్‌రెడ్డి గురువారం తెలిపారు. నైరుతి రుతుపవనాల ప్రభావంతో గురువారం కొలిమిగుండ్ల మండల పరిధిలో వర్షం కురిసింది. కొలిమగుండ్ల, మీర్జాపురం, బెలుం, నాయినిపల్లె, పెట్నికోట, గోర్విమాన్‌పల్లె, కనకాద్రిపల్లె, ఇటిక్యాల, అంకిరెడ్డిపల్లి, చింతలాయపల్లి, తిమ్మానాయునిపేట, కలవటాల, నందిపాడు, యర్రగుడి గ్రామాల పరిధిలో వర్షం కురిసింది. ఈ వర్షం పంటల సాగుకు ఎంతో ఉపయోగపడుతుందని ఏఎస్ఓ భాస్కర్‌రెడ్డి తెలిపారు.

## రైతుల పొలాల్లో కిందపడిన.. కరెంటు స్థంబాలు

**- పట్టించుకోని విద్యుత్ అధికారులు**



**కొలిమిగుండ్ల, జూన్ 13, ప్రభాతవార్తః** కొలిమిగుండ్ల మండలంలోని మీర్జాపురం గ్రామంలో రైతుల పొలాల్లో విద్యుత్ స్థంబాలు కిందపడిపోయి రైతులకు అడ్డంగా తీగలు స్థంబాలు సేద్యానికి ఇబ్బందికరంగా ఉన్న విద్యుత్ అధికారులు ఏమాత్రం పట్టనట్టు వ్యవహరిస్తున్నారని గ్రామ రైతులు వాపోతున్నారు. వివరాల్లోకి వెళ్తితే మీర్జాపురం గ్రామానికి గతంలో సింగిల్ ఫేస్ కరెంటు స్థంబాలు ఉన్నవి ఈమధ్యకాలంలో త్రీఫెస్ కరెంటు లాగి కొత్త లైన్ల ద్వారా గ్రామానికి కరెంటు సరఫరా చేస్తున్నారు. పాత లైన్ వారికి సంబంధం లేన్నట్టుగా వ్యవహరిస్తున్నారు. ఏది ఏమైనా రైతుల పొలాల్లో కిందపడిన స్థంబాలు, తీగలు తొలగించాల్సి న బాధ్యత విద్యుత్ అధికారులదే కదా రైతుల మీద ఇంత నిర్లక్ష్యం పనికిరాదని గ్రామ రైతులు పలువురు చర్చించుకుంటున్నారు. విషయం విద్యుత్ పైఅధికారులు గమనించి చర్యలు తీసుకోవాలని మీర్జాపురం గ్రామ రైతులు కోరుతున్నారు.






# మొట్టమొదటిసారిగా బనగానపల్లెకు మంత్రి పదవి

- ప్రజాసేవకు అంకితమైన బీసీ కుటుంబం
- గడిచిన ఐదేళ్ల కష్టకాలంలో పార్టీకి అండగా నిలిచిన బీసీ జనార్ధన్‌రెడ్డి
- నిత్యం ప్రజలకు అందుబాటులో బీసీ ఇందిరారెడ్డి సోదరుడు బీసీ రాజారెడ్డి
- నియోజకవర్గంలో అనేక చోట్ల మినరల్ వాటర్ ప్లాంట్ల ఏర్పాటు
- పేదలకు అండగా పలు సేవ కార్యక్రమాలు

**బనగానపల్లెరూరల్ ,జూన్ 13, ప్రభాతవార్త:** మొట్టమొదటిసారిగా బనగానపల్లె ప్రాంతానికి రాష్ట్ర కేబినెట్‌లో చోటు దక్కింది. ఈ మేరకు గతంలో పాణ్యం నియోజకవర్గ పరిధిలో బనగానపల్లె, బేతంచెర్ల, వెల్దుర్తి మండలాలు ఉండేవి. అదే విధంగా కోవెలకుంట్ల నియోజకవర్గ కేంద్రంగా ఉండేది. ఇలాంటి సమయంలో పాణ్యం ఎమ్మెల్యేగా కాటసాని రాంభూపాల్‌రెడ్డి 1985 ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. అలాగే మరో రెండు పర్యాయాలు పాణ్యం ఎమ్మెల్యేగా కాటసాని రాంభూపాల్‌రెడ్డి కొనసాగారు. అనంతరం 1999లో టీడీపీ పార్టీ తరుపున బిజ్జం పార్థసారథిరెడ్డి పాణ్యం ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. తదనంతరం 2004లో మళ్లీ కాటసాని రాంభూపాల్‌రెడ్డి పాణ్యం ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2009 ఎన్నికలకు వచ్చేసరికి డిలిమిటేషన్‌లో భాగంగా బనగానపల్లె కేంద్రంగా నియోజకవర్గంగా ఏర్పాటైంది. అప్పుడు ప్రజారాజ్యం పార్టీ తరుపున కాటసాని రామిరెడ్డి ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2014లో టీడీపీ పార్టీ తరుపున బీసీ జనార్ధన్‌రెడ్డి కాటసాని రామిరెడ్డి పై గెలుపొందారు. 2019 ఎన్నికలకు వచ్చేసరికి వైఎస్సార్ ఫ్యాన్ గాలి బాగా వీచడంతో మరొకసారిగా కాటసాని రామిరెడ్డి గెలుపొందారు. 2024 ఎన్నికల్లో బీసీ జనార్ధన్‌రెడ్డి కాటసాని రామిరెడ్డి పై విజయం సాధించారు. అయితే ఈ ఎన్నికల్లో గతంలో ఎప్పుడు లేని విధంగా బనగానపల్లెలో బీసీ జనార్ధన్‌రెడ్డి మంత్రి పదవి దక్కించుకుని చరిత్రను సృష్టించారు. ఈ సందర్భంగా బుధవారం జరిగిన ప్రమాణస్వీకారం కార్యక్రమంలో బీసీ జనార్ధన్‌రెడ్డి రాష్ట్ర మంత్రిగా ప్రమాణస్వీకారం చేశారు. వివరాల్లోకి వెళితే బీసీ జనార్ధన్‌రెడ్డి హైదరాబాద్ నగరంలో స్థిరాస్తి వ్యాపారాన్ని చేసుకునేవారు. ఇలాంటి సమయంలో ఆయనకు పేదల సేవ చేయాలనే ఆలోచనతో మొట్టమొదటిసారిగా 2010లో రాజకీయ అరగ్రేటం చేశారు. వెంటనే 2011లో బనగానపల్లె నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు చేపట్టారు. అప్పటి నుంచి బీసీ జనార్ధన్‌రెడ్డి ఆయన సతీమణి బీసీ ఇందిరారెడ్డిలు, సోదరుడు బీసీ రాజారెడ్డి నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించి 2014 ఎన్నికల్లో విజయం సాధించి నియోజకవర్గ అభివృద్ధికి బాటలు వేశారు. బీసీ జనార్ధన్‌రెడ్డి స్వగ్రామం యనకండ్ల బనగానపల్లె మండలం. ఆయన సతీమణి బీసీ ఇందిరారెడ్డి, కుమారుడు బీసీ మనోహర్‌రెడ్డి, కుమార్తెలు బీసీ మనోరమ, బీసీ శ్రీలక్ష్మి. ఆయన తండ్రి బీసీ గురెడ్డి యనకండ్ల గ్రామానికి సర్పంచ్‌గా పనిచేశారు. అలాగే ఆయన సోదరుడు బీసీ రాజారెడ్డి బనగానపల్లె మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా పనిచేసి బనగానపల్లె పట్టణంలోని అభివృద్ధి పనులు చేపట్టి ప్రజల గుండెల్లో నిలిచిపోయారు. ఆయన చేసే ప్రతి పనిలో నాణ్యత ఖచ్చితంగా ఉండాలనేవారు. అదే విధంగా నియోజకవర్గంలో బీసీ జనార్ధన్‌రెడ్డి అనేక ప్రాంతాల్లో మినరల్ వాటర్ ప్లాంట్లను స్థాపించారు. బీసీ రాజారెడ్డి బేతంచెర్ల మండలం ఆర్ఎస్ రంగాపురం గ్రామ సమీపంలో ఉన్న శ్రీ మద్దిలేటి లక్ష్మినరసింహస్వామి ఆలయంలో మినరల్ వాటర్ ప్లాంట్‌ను స్థాపించడంతోపాటు మెట్ల మార్గంలో భక్తులకు నీడ కోసం రేకుల షెడ్‌ను ఏర్పాటు చేయించారు. అలాగే బేతంచెర్ల రహదారిలో గోర్లగుట్ట వద్ద మరొక మినరల్ వాటర్ ప్లాంట్‌ను బీసీ రాజారెడ్డి నెలకొల్పి ఎంతో మంది దాహార్తిని తీరుస్తున్నారు. ఇంతేకాకుండా బీసీ రాజారెడ్డి పేదలకు అండగా మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టారు. ఇందులో భాగంగా నియోజకవర్గంలో 160 మంది అంధులకు ప్రతినెల 1వ తేదిన ఒక్కొక్కరికి రూ.500లు చొప్పున మొత్తం రూ.80వేలు తమ సొంత నిధులు వెచ్చించి అందిస్తున్నారు. అలాగే తెలంగాణలో ఒక అనాథ ఆశ్రమం గురించి బీసీ రాజారెడ్డి ఒక ప్రకటనలో చూశారు. దాన్ని ఎలాగైనా సందర్శించాలనే ఉద్దేశ్యంతో అక్కడికి వెళ్లి అక్కడ ఉన్న అనాథ అభాగ్యులను బీసీ రాజారెడ్డి స్వయంగా చూసి చలించిపోయారు. వారికి ఏదైనా ఒక విధంగా తన వంతు సహాయాన్ని చేయాలని తలచి వారికి రెండు లారీల నంద్యాల మసూర సన్న బియ్యాన్ని వారికి పంపించి వారి ఆకలిని తీర్చారు. ఇంతే కాకుండా నియోజకవర్గంలోని ప్రతి పేదింటి ఆడపడుచుకు తన వంతుగా పెళ్లికానుకను బీసీ రాజారెడ్డి అందజేస్తుంటారు. 2019 ఎన్నికల అనంతరం ఓటమిని చవిచూసిన బీసీ జనార్ధన్‌రెడ్డి ఏమాత్రం నిరాశ చెందకుండా బనగానపల్లెలోనే ఉంటూ తేదేపా నాయకులకు, కార్యకర్తలకు అండగా నిలిచి



పోరాటాలు చేశారు. తమ పార్టీ కష్టకాలంలో ఉన్న సమయంలో అండగా నిలిచారు. ఇంతే కాకుండా ఒంగోలు, నెల్లూరు పార్లమెంట్‌లకు ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు చేపట్టి పార్టీ కోసం కృషి చేశారు. బీసీ జనార్ధన్‌రెడ్డి పై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసులు పెట్టినా కూడా భయపడకుండా కార్యకర్తలను కాపాడుకుంటూ ముందుకు సాగారు. ఆయన పడిన కష్టం ఎనలేనిది. చాలా సందర్భాల్లో ఆయన అందుబాటులో లేకపోయినా ఆయన సతీమణి బీసీ ఇందిరారెడ్డి నియోజకవర్గంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ, ప్రజా గళం కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించేవారు. అలాగే బీసీ రాజారెడ్డి ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రతిఒక్కరి కష్టసుఖాలను అడిగి తెలుసుకుని వారికి అండగా నిలిచేవారు. ఇలా కష్టపడే నాయకుడిని టీడీపీ అధిష్ఠానం గుర్తించి ఆయనకు మంత్రి పదవి కట్టబెట్టింది. దీంతో టీడీపీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తూ సంబరాలు జరుపుకుంటున్నారు.

## బనగానపల్లెలో రెండు ఇళ్లల్లో చోరీ



**బనగానపల్లె ,జూన్ 13, ప్రభాతవార్త:** బనగానపల్లె పట్టణంలో వివిధ ప్రాంతాల్లోని రెండు ఇళ్లల్లో చోరీలు జరిగిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. వివరాల మేరకు పట్టణంలోని కరెంట్ ఆఫీస్ దగ్గరలో ఉన్న సుదర్శన్‌రెడ్డి ఇంట్లో జరిగిన చోరీలో ఐదు తులాల బంగారు దుండగులు చోరీ చేయగా, తెలుగుపేటలోని సాధుల శివశంకర్‌రెడ్డి ఇంట్లో రూ.30వేలు నగదు చోరీ జరిగినట్లు సీఐ గంటా సుబ్బారావు తెలిపారు. సీఐ తెలిపిన వివరాల మేరకు సుదర్శన్‌రెడ్డి కొత్త ఇంటికి నీళ్లు పెట్టుకునేందుకు ఇంటికి తాళం వేసి వెళ్లాడని ఆ సమయంలో దుండగులు తాళం పగులగొట్టి ఇంట్లో ఉన్న ఐదు తులాల బంగారు చోరీ చేశారని అలాగే సాధుల శివశంకర్‌రెడ్డి ఇంటికి తాళంవేసి బెంగుళూరు వెళ్లాడని ఇది గమనించిన దుండగులు తాళం పగులగొట్టి ఇంట్లో ఉన్న రూ.30వేలు నగదు చోరీ చేసినట్లు బాధితులు ఫిర్యాదు చేసినట్లు ఈ మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ గంటా సుబ్బారావు తెలిపారు.

## మాటతప్పని మడమ తిప్పని ప్రభుత్వం టిడిపి

– జిల్లా అధికార ప్రతినిధి వెంకటరాముడు నాయక్

**అవుకు, జూన్ 13, ప్రభాతవార్త :** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అధికారం చేపట్టిన వెంటనే మెగా డిఎస్సీపై తొలిసంతకం చేయడం పట్ల నంద్యాల పార్లమెంటు తెలుగు యువత జిల్లా అధికార ప్రతినిధి ఎస్ వెంకటరాముడు నాయక్ హర్షం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఎన్నోపోరాటాలు చేసినా చలనం లేకపోవడంతో అభ్యర్థులందరికి అండగా ఉంటానని నారా చంద్రబాబు నాయుడు ఎన్నికల ముందు మాట ఇవ్వడం జరిగిందని ఆ మాట నిలబెట్టుకుంటూ గురువారం 16,347 డిఎస్సీ పోస్టుల భర్తీకి మొదటి సంతకం చేయడం చాల ఆనందకరంగా ఉందని వారు తెలిపారు. నిరుద్యోగులకు



ఎన్నికల ప్రచారంలో హామి ఇచ్చిన మాట ప్రకారం డిఎస్సీ నోటిఫికేషన్‌పై తొలిసంతకం చేయడం హర్షించదగ్గ విషయమని వారు తెలిపారు. గత ప్రభుత్వంలో డిఎస్సీ నోటిఫికేషన్ ఇస్తానని చెప్పి నిరుద్యోగులను నయవంచనకు గురిచేశారన్నారు. డిఎస్సీ అత్యధికసార్లు నోటిఫికేషన్ విడుదల చేసిన చరిత్ర గల ఘనత ఒక తెలుగుదేశం పార్టీకే దక్కుతుందని వారన్నారు. ఆ నమ్మకంతోనే సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి పార్టీకి పట్టం కట్టారని ఆయన తెలిపారు.

## మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన టంగుటూరి శీనయ్య



**బనగానపల్లెరూరల్ ,జూన్ 13, ప్రభాతవార్త:** గన్నవరం ఆవరణంలో గల కేసరపల్లిలో జరిగిన ముఖ్యమంత్రి, మంత్రుల ప్రమాణస్వీకారోత్సవంలో టంగుటూరి శీనయ్య పాల్గొన్నారు. ఇందులో భాగంగానే బనగానపల్లె నియోజకవర్గ ఎమ్మెల్యే బీసీ జనార్ధన్‌రెడ్డికి చంద్రబాబు నాయుడు కేబినెట్‌లో మంత్రి పదవి దక్కింది. ఈ మేరకు బీసీ జనార్ధన్‌రెడ్డి రాష్ట్ర మంత్రిగా ప్రమాణస్వీకారం చేశారు. అనంతరం టీడీపీ నంద్యాల పార్లమెంట్ వాణిజ్య విభాగం అధ్యక్షులు టంగుటూరి శీనయ్యతోపాటు పలువురు మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శాలువలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా టంగుటూరి శీనయ్య మాట్లాడుతూ గత 2019 ఎన్నికల్లో బీసీ జనార్ధన్‌రెడ్డి ఫ్యాన్ గాలి ప్రభావంతో ఓటమిని చవి చూసినప్పటికి ఏమాత్రం నిరాశ చెందకుండా నిత్యం ప్రజల్లో ఉంటూ వారి కష్టసుఖాలను తెలుసుకుని వారికి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తూ ప్రజల మన్ననలను పొందారన్నారు. బనగానపల్లె నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం పరితపించే నాయకుడని ఆయన పడిన కష్టం టీడీపీ అధిష్ఠానం గుర్తించి రాష్ట్ర కేబినెట్‌లో మంత్రి పదవి కట్టబెట్టడం హర్షించదగ్గ విషయమని టంగుటూరి శీనయ్య అన్నారు. రానున్న రోజుల్లో బనగానపల్లె నియోజకవర్గ రూపురేఖలు మార్చి బనగానపల్లెను మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దడం జరుగుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో లాయర్ నాగేంద్రారెడ్డి, మాజీ సింగిల్‌విండో అధ్యక్షులు మల్లారెడ్డి, రఘురామిరెడ్డి, మీరాపురం బత్తుల భాస్కర్‌రెడ్డి, యనకండ్ల ఖాదర్ తదితరులు ఉన్నారు.

## సబ్సిడీ విత్తనాల కోసం ధరఖాస్తు చేసుకోండి

– మండల అగ్రికల్చర్ ఆఫీసర్

**బేతంచెర్ల, జూన్ 13, ప్రభాతవార్త:** ఖరీఫ్ సీజన్‌లో కందులు, వేరుశెనగ, కొర్ర సాగుచేయదలిచిన రైతులు సబ్సిడీ విత్తనాల కోసం ధరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి కిరణ్‌కుమార్ గురువారం కోరారు. మండలంలో జూన్ నెలలో ఇప్పటి వరకు 256 మి.మి. వర్షపాతం నమోదు అయిందని దీంతో భూమిలో తేమ అధికంగా ఉందన్నారు. కావునా రైతులు సాగుచేసుకునేందుకు పదును కావడం జరిగిందన్నారు. 40 శాతం సబ్సిడీతో వేరుశెనగ, 30 శాతం సబ్సిడీతో కందులు, 50 శాతం సబ్సిడీతో కొర్రలు అందుబాటులో ఉన్నాయన్నారు. అవసరమైన రైతులు రైతు భరోసా కేంద్రాల్లో

## వైసిపి నాయకుడు పువ్వాడి బాస్కర్‌పై దాడి..

: రాజకీయాన్ని అడ్డుపెట్టుకోని దాడులు చేయడం సరైందికాదు
: కక్షసాదింపుతోనే మాపై దాడులు చేస్తున్నారు
: పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన బాధితుడు
: మున్సిపల్ వైస్ చైర్మన్ భర్తపై దాడికి పాల్పడ్డా దుండగులు
: పట్టపగలు నడిరోడ్డుపై దాడులు చేయడం హేయనీయమైన చర్య





**ఆత్మకూరు జూన్13,ప్రభాతవార్త:** ప్రజా స్వామ్యంలో అందరికి తిరిగే హక్కులు అధికారం ఉన్నప్పుడు మనుషులంత సమానంగా చూడాల్సిన పరిస్థితి ఉన్నప్పటికి రాజకీయ కక్షసాదింపుతో మాపై దాడులు చేయడం సరైంది కాదని ఆత్మకూరు మున్సిపల్ వైస్ చైర్మన్ భర్త వైసిపి నాయకులు పువ్వాడి బాస్కర్ ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం పట్టణంలో కర్నూలు – గుంటూరు జాతీయ రహదారిపై కొందరు దుండగులు నాపై కక్షపూరితంగా దాడి చేయడం జరిగిందని మీడియా ముందు వివరాలను వెల్లడించారు. రాజకీయాని అడ్డుపెట్టుకోని దాడులు చేయడం సరైందికాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆత్మకూరు పట్టణంలో ఎన్నడులేని విదంగా దాడులు చేస్తే సమస్యలు తీరుతాయా అంటూ ప్రశ్నించారు. నడిరోడ్డుపై పట్టపగలు ప్రజలు చూస్తున్నారనే ఇలా దాడులు చేయడం హేయనీయమైన చర్య అని అన్నారు. గెలుపు ఓటములు అనేది సర్వ సాదారణమే అయితే రాజకీయ లబ్దికోసం వైసిపి నాయకులను టార్గెట్ చేసి దాడులకు పాల్పడుతున్న దుండగులపై పోలీసులు చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. పువ్వాడి బాస్కర్ ఎడమ చేతికి పలు చోట్ల శరీరంపై గాయాలు అధికంగా అయ్యాయి. ఏదిఏమైన్నప్పటికి పట్టణంలో కొత్త రకమైన రాజకీయం ప్రారంభం కావడంతో వైసిపి నాయకులు భయందోళనకు గురవుతున్నట్లు సమాచారం.

## పాఠశాలలు పునఃప్రారంభం

– పాఠశాలలకు పుస్తకాలు అందజేత



**కొత్తపల్లి, జూన్13,ప్రభాతవార్త :** మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు పుస్తకాలను అందజేశామని ఎంఈఓలు శ్రీరాములు,ఇనాయతుల్లాలు అన్నారు.గురువారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులకు వాటిని పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎంఈఓ శ్రీరాములు మాట్లాడుతూ మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు పునఃప్రారంభం అయ్యాయన్నారు.విద్యార్థులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా పాఠ్యాంశాలు చెప్పేందుకు పుస్తకాలను అన్ని పాఠశాలల సిబ్బందికి అందజేశామన్నారు. విద్యార్థులు పాఠశాలలకు వచ్చేందుకు ఉపాధ్యాయులు వారి ఇంటివద్దకు వెళ్లి విద్యార్థులను బడులకు రావాలన్నారు.అదేవిధంగా పాఠశాలలు ప్రారంభం అయ్యాయి,కనుక ఉపాధ్యాయులు సమయపాలన పాటించి,విద్యార్థులకు నాణ్యమైన అదించాలని సూచించారు.

## ప్రజల రాకపోకలకు అటంకం కలిగించిన వారిపై కేసు నమోదు

–ఎస్ఐ కిరణ్



**అవుకు, జూన్ 13, ప్రభాతవార్త:** అవుకు మండలంలోని అన్నవరం గ్రామానికి పోయే తారురోడ్డును తవ్వి రాకపోకలకు అటంకం కలిగించిన ముగ్గురిపై కేసు నమోదుచేసినట్లు అవుకు ఎస్ఐ కిరణ్ తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నవరం గ్రామానికి పోయే తారు రోడ్డును గురువారం ఉదయం శ్రీనివాసరెడ్డి, అమర్నాథ్‌రెడ్డిలు జేసిబి డ్రైవర్ మునిరంగడుతో తవ్వి ప్రజల రాకపోకలకు అటంకం కలిగించారనే ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు కట్టి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన అన్నారు. సంఘటన స్థలాన్ని డిప్యూటి తహశీల్దార్ ప్రసాద్ బాబు, ఆర్ఐ రాముడు, పంచాయితీ సెక్రెటరీ రాజేష్, తలారి దేవమ్మ, గ్రామస్థులు సందర్శించారు.

# దంచికొడుతున్న.. వానలు..!

: ఉపరితల ఆవర్తనంతో భారీ వర్షాలు
: మరో 4 రోజులు ఇదే పరిస్థితి



**ఏపీ తెలంగాణలో భారీ వర్షాలు కురుస్తాయని విశాఖపట్నం వాతావరణం కేంద్రం డైరెక్టర్ సునంద తెలిపారు. ఈ మేరకు శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు వివిధ ప్రాంతాల్లో వర్షాలకి సంబంధించిన వివరాలు అందించారు. ముఖ్యంగా ఏపీలో రాయలసీమలోను దక్షిణ కోస్తా కృష్ణా జిల్లాలోనూ అలాగే ఉత్తర కోస్తా ప్రాంతంలో వానలు కురుస్తాయి. బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం వల్ల ఇది జరుగుతోందని విశాఖపట్నం వాతావరణ కేంద్రం అధికారులు వివరించారు.**

**కర్నూలు, జూన్ 13, ప్రభాతవార్త :** దక్షిణ తెలంగాణ పరిసర ప్రాంతాల్లో ఉపరితల ఆవర్తనం ఏర్పడింది. ఇది 16 డిగ్రీల ఉత్తర అక్షాంశం దగ్గర, షియర్ జోన్ ఉంటున్న కారణంగా వర్షాలు కురుస్తాయి. అలాగే రుతుపవనాలు కారణంగా కూడా ఇది ఏర్పడిందని విశాఖపట్నం వాతావరణ శాఖ అధికారి వివరించారు. దీని ప్రభావం వల్ల తెలంగాణ రాష్ట్రంతో పాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జిల్లాలలో వర్షాలు బాగా విస్తారంగా కురుస్తాయని తెలిపారు.

రాయలసీమలోని కడప కర్నూలు జిల్లాలలోనూ, దక్షిణ కోస్తాలోని కృష్ణ గుంటూరు ప్రకాశం జిల్లాలలోనూ భారీగా విస్తారంగా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అంచనా వేసింది. ఉత్తరకోస్తాలోని దాదాపు మూడు జిల్లాల్లోనూ వర్షాలు ఉంటాయని తెలిపింది. ఈరోజు రేపట్లో రుతుపవనాలు శ్రీకాకుళాన్ని తాకుతాయని ఈ నేపథ్యంలో అక్కడ కూడా విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని సూచించింది.గత రెండు రోజులుగా వాతావరణ చల్లబడటం, కొన్ని చోట్ల శుక్రవారం రాత్రి వర్షం ఉరుములు, మెరుపులతో వర్షం కురవడంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. జనం ఇళ్లల్లోంచి బయటకొచ్చి సేదతీరుతున్నారు. ఉష్ణోగ్రతలు సైతం అదుపులోకి వచ్చినట్లు విశాఖపట్నం వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. రుతు పవనాలు త్వరలోనే రాష్ట్రమంతటా విస్తరించే అవకాశాలు కనిపిస్తుండటంతో ఈ ఏడాది వర్షాలకు లోటు ఉండదని అధికారులు చెబుతున్నారు.

ఈ సంవత్సరం టైమ్ ప్రకారం వానలు కురుస్తున్నాయి. గత 3 ఏళ్లుగా ఈ పరిస్థితి లేదు. ఈ సంవత్సరం ఏప్రిల్‌లోనే తీవ్ర ఎండలు వచ్చేయడంతో.. అప్పుడు తయారైన మేఘాలకు నైరుతీ రుతుపవనాలు కలవడంతో.. త్వరగా వర్షాలు వచ్చేశాయి.

నైరుతీ రుతుపవనాలు క్రమంగా మధ్య అరేబియా సముద్రం, కోస్తాంధ్ర, తెలంగాణ, దక్షిణ మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, దక్షిణ ఒడిశాలో విస్తరిస్తున్నాయి. కొన్ని ఉత్తర గాలులు.. నిజామాబాద్, విజయనగరం గుండా వెళ్తున్నాయి. ఈ 2 రోజుల్లో నైరుతీ రుతుపవనాలు తెలంగాణ అంతటా విస్తరించేందుకు వీలు ఉందని భారత వాతావరణ విభాగం చెప్పింది.

మహారాష్ట్ర నుంచి కేరళ వరకూ షియర్ జోన్ ఉంది. దీని వల్ల వచ్చే 5 రోజులపాటూ తెలంగాణ, రాయలసీమ, కోస్తాంధ్ర, యానాంలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయి. అలాగే గాలి వేగం గంటకు 40 నుంచి 50 కిలోమీటర్లుగా ఉంటుంది. అలాగే ఉరుములు, మెరుపులు కూడా బాగా వస్తాయి.

శాటిలైట్ ప్రెసిపిటేషన్ అంచనాల ప్రకారం.. కోస్తాకి పక్కన బంగాళాఖాతంలో ఓ అల్పపీడనం ఏర్పడి.. దాని నుంచి వస్తున్న మేఘాలు కోస్తాంధ్ర, రాయలసీమపై విస్తరిస్తున్నాయి. దీంతో తెలుగు రాష్ట్రాల్లో మేఘాలు ఉంటాయి. మధ్యాహ్నం 3 తర్వాత విశాఖలో చిన్నగా వాన పడుతుంది. అలాగే పశ్చిమ తెలంగాణలో మోస్తరు నుంచి భారీ వర్షం కురుస్తుంది. ఐతే.. మేఘాల కదలికను బట్టి.. వర్షం కురిసే ప్రాంతం మారే అవకాశం ఉంది. అందువల్ల కచ్చితంగా కురుస్తుందన్న గ్యారెంటీ లేదు. బంగాళాఖాతంలో గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో.. దక్షిణం నుంచి ఉత్తరానికి గాలులు వెళ్తున్నాయి. ఏపీలో గాలి వేగం గంటకు 15 నుంచి 24 కిలోమీటర్లుగా ఉంది. ఉత్తరాంధ్రలో 15 ఉండగా.. రాయలసీమలో 24 ఉంది. తెలంగాణలో 10 నుంచి 15 కిలోమీటర్లుగా ఉంది. మొత్తంగా గాలి ఎక్కువగా ఉంది కాబట్టి.. టూవీలర్లపై ప్రయాణించేవారు చాలా జాగ్రత్తగా డ్రైవ్ చెయ్యాలి. ఉష్ణోగ్రత చూస్తే.. కోస్తాంధ్ర, తూర్పు రాయలసీమ, ఉత్తరాంధ్రలో ఎండ ఎక్కువగా ఉంటుంది. తూర్పు, ఉత్తర తెలంగాణలో కూడా ఎండ ఉంటుంది. ఐతే.. మేఘాలు కూడా ఉంటాయి. మధ్యమధ్యలో ఎండ వస్తూ ఉంటుంది. ఏపీలో మాగ్జిమం టెంపరేచర్ 36 డిగ్రీల సెల్సియస్ ఉంటుంది. తెలంగాణలో 37 డిగ్రీల సెల్సియస్ ఉంటుంది. హైదరాబాద్‌లో 31 డిగ్రీల సెల్సియస్ ఉంటుంది.

ఇవాళ తేమ ఎక్కువగానే ఉంది. పశ్చిమ తెలంగాణ, పశ్చిమ రాయలసీమ, ఉత్తరాంధ్రలోనే తేమ బాగా ఉంది. ఏపీలో 47 శాతం, తెలంగాణలో 58 శాతం ఉంది. అందువల్ల వేర్వేరు



ప్రాంతాల్లో సడెన్‌గా వాన పడే అవకాశాలు ఉంటాయి. ఏపీలో మాత్రం ఇవాళ భారీ వర్షాలు ఉండకపోవచ్చు.

## క్యాన్సర్ పై అవగాహన కార్యక్రమం



**బనగానపల్లె ,జూన్ 13, ప్రభాతవార్త:** బనగానపల్లె పట్టణంలోని ఏరియా ఆసుపత్రి నందు గురువారం వైద్యాఆరోగ్య శాఖ అడిషనల్ డాక్టర్ రామనాథరావు, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ వెంకటరమణ, ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సుజాత, డీజీవో డాక్టర్ ప్రశాంతి, దంత వైద్యులు డాక్టర్ పద్మజలు వైద్యాధికారులకు మరియు కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లకు, ఏఎన్ఎంలకు క్యాన్సర్ గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైద్య ఆరోగ్యశాఖ అడిషనల్ డైరెక్టర్ రామనాథరావు మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో ఓరల్ క్యాన్సర్, బ్రెస్ట్ క్యాన్సర్, బ్లడ్ క్యాన్సర్ రోగుల సంఖ్య పెరుగుతుందని క్యాన్సర్ పట్ల ప్రతిఒక్కరు అవగాహన కలిగి ఉండాలని క్యాన్సర్‌ను మొదటి దశలోనే గుర్తిస్తే వైద్య రంగంలో నూతన సాంకేతిక పరిజ్ఞానంతో క్యాన్సర్‌ను నయం చేయవచ్చుని ఆయన తెలిపారు. గ్రామాల్లో ప్రజలకు క్యాన్సర్ పట్ల వైద్య సిబ్బంది అవగాహన కల్పించాలని త్వరగా గుర్తిస్తే దాన్ని నయం చేయవచ్చుని తెలియజేయాలని వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శివశంకరుడు, డాక్టర్ మధు మౌనిక, ఏఎన్ఎంలు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాలలకు పాఠ్యపుస్తకాలు పంపిణీ..

**- కోసిగి మండలంలో 64 వేల పుస్తకాలు మంజూరు..**

**- 42 వేల పుస్తకాలు మాత్రమే రాగా, యూనిఫాంలు లేవు..**



**కోసిగి, జూన్ 13, ప్రభాతవార్త :** కోసిగి మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు సంబందించి పాఠ్యపుస్తకాలను మండల విద్యాధికారులు మొయినుద్దీన్, నాగేశప్పలు ఆయా పాఠశాలలకు పంపిణీ చేసారు..గురువారం కోసిగిలోని బాలుర ఉన్నత పాఠశాలలోనిల్వ ఉంచిన పాఠ్యపుస్తకాలను వారు ఉపాధ్యాయులకు పంపిణీ చేసారు..ఈ సందర్భంగా ఆయా గ్రామాలకు చెందినపాఠశాలల ఉపాధ్యాయులు ఆటోలు, వాహనాలలో తమతమ పాఠశాలలకు తరలించారు.. మండలంలోని జిల్లా పరిషత్‌ఉన్నత పాఠశాలలు, ప్రాథమికోన్నత పాఠశాలలు, ప్రాథమిక పాఠశాలలకు సంబందించి మొత్తం 64వేల పాఠ్యపుస్త కాలురావాల్సి ఉండగా అందులో కేవలం 42 వేల పాఠ్యపుస్తకాలు మాత్రమే కోసిగి మండలానికి చేరాయి.. పూర్తిస్థాయిలోపాఠ్యపుస్తకాలను తీసుకురావడంలో విద్యాధికారులు విఫలమయ్యారని తెలుస్తోంది..అయితే మిగతా పాఠ్యపుస్తకాలు కూడా త్వరలో వస్తాయని విద్యాధికారి మొయినుద్దీన్ తెలిపారు..కాగా ప్రస్తుతం పాఠశాలలు తెరిచినప్పటికీ నేటి వరకుఏకరూప దుస్తులు అంటే పాఠశాల యూనిఫాంలను అందించలేక పోయారు..పలుచోట్ల ఈ యూనిఫాంలను అందించడంలో విద్యాధికారులు సఫలీకృతం కాగా కోసిగిలో మాత్రం యూనిఫాంల కోసం ఎలాంటి ప్రయత్నాలు జరుగనట్లు కనిపించడం లేదు.. కానీ పాఠశాలలకు సంబందించిన సంచులను మాత్రం అరకొరగా అందించి చేతులు దులుపుకున్నారు.. ఏదీ ఏమైనప్పటికి పాఠశాలలు తెరిచేనాటికి పుస్తకాలను పూర్తిస్థాయిలో అందించలేదనేది తెలుస్తోంది.ఇక నోట్‌పుస్తకాలు కూడా ఇంకా పలు మండల కేంద్రాలకు రాలేదు.. వాటిని కూడా త్వరలో సరఫరా చేసేందుకు నూతన ప్రభుత్వం ప్రయత్నం చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు..

**ఉత్సాహంగా పాఠశాలల పునఃప్రారంభం:-** వేసవి సెలవుల తరువాత విద్యార్థులు సంతోషంగా బడికి వచ్చారు..కోసిగి మండలంలో పాఠశాలల పునఃప్రారంభం ఉత్సాహంగా జరిగింది..అయితే కొన్ని చోట్ల మాత్రం ఆలస్యంగా బడులుతెరిచినట్లు సమాచారం..ఉత్సాహంగా పాఠశాలలకు విద్యార్థులు వచ్చారు.. ముఖ్యంగా పై తరగతులకు వెళ్తున్నామన్న సంతోషంలో విద్యార్థులు ఉత్సహంగా తరలి వచ్చారు..

## లంబాడి హక్కుల సాధనకై ఛలో హైదరాబాద్

**కర్నూలు విద్య, జూన్ 13, ప్రభాతవార్త:** లంబాడి హక్కుల పోరాట సమితి అవిర్భావం దినోత్సవం సందర్భంగా నేషనల్ గోర్ బంజారా సమ్మేలణ్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు కైలాస్ నాయక్ మాట్లాడుతూ మా తాండలో మా రాజ్యం మేము ఎంత మందిమో మాకు అంత వాటా అనే నినాదంతో 1997 జూలై 1న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నందు లంబాడి హక్కుల పోరాట సమితి అనే సంఘం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సంఘం ఏర్పడి నేటికి 28 సంవత్సరాలు పూర్తి అవుతున్నదని సంఘం అవిర్భావ దినోత్సవంగా దేశవ్యాప్తంగా ఉన్నటువంటి బంజార జాతి ప్రతినిధులతో సమావేశం ఉంటుందని జిల్లాలోని లంబాడి మేధావులు, పెద్దలు, విద్యార్థులు అందరు కలిసి రావాలన్నారు. ఈకార్యక్రమంలో నేణావత్ రాము నాయక్, పోస్టల్ నాగరాజు నాయక్, రామాంజనేయులు నాయక్, శ్రీను నాయక్, లక్ష్మణ్ నాయక్, విజయ్, దేవా, సతీష్ పాల్గొన్నారు.

## చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించండి



**చాగలమర్రి ,జూన్ 13, ప్రభాతవార్త:** చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుశీలమ్మ తెలిపారు. గురువారం చాగలమర్రి పట్టణంలోని 6,14 అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ బడిబాట కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో రెండున్నర సంవత్సరాలు పైబడిన చిన్నారులను చేర్పించాలంటూ ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. అనంతరం తల్లులకు, కిశోర బాలికలకు బాలసభ నిర్వహించారు. బాల్య వివాహాలు, పిల్లల పెరుగుదల పై తల్లులక అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు అనురాధ, రజిని, చిన్నారులు, చిన్నారుల తల్లులు తదితరులు పాల్గొన్నారు.

## బీసీకి మంత్రిపదవి వచ్చిన సందర్భంగా కమ్మవారిపల్లెలో పూజలు



**కొలిమిగుండ్ల, జూన్13, ప్రభాతవార్త:** కొలిమిగుండ్ల మండల పరిధిలోని కమ్మవారిపల్లె గ్రామంలో గురువారం బీసీ జనార్థన్‌రెడ్డికి మంత్రి పదవి వచ్చిన శుభసందర్భంగా రామాలయం, పెద్దమ్మతల్లి అమ్మవారికి రెండుచోట్ల 101 టెంకాయలు కొట్టి తమ మొక్కుబడిని తీర్చుకున్నారు. ఈకార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు ఎం రామదాసు, పి వెంకటేశ్వర్‌రావు, నరసింహా, వేణు, మురళీ, భార్గవ్, ఆదినారాయణ, ధర్మారాయుడు, వెంకటేశ్వర్‌రెడ్డి, సి నరసయ్య, మానికింద శ్రీను, పి నారాయణస్వామి, టి శ్రీను, ఆర్ వెంకటేష్, టి లక్ష్మీనారాయణ, డి రాజా కళ్యాణ్, రవి, గోవర్ధన్, ఆదివలి, జి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## గొప్పశక్తి, అద్భుత వరములు కలిగిన గురువు పునీత ఆంతోనీ వారు...

**- కన్నుల పండుగ పునీత ఆంతోనీ వారి పండగ వేడుకలు**



**ఆదోనిలీగల్, జూన్13, ప్రభాతవార్త;** కర్నూలు పాస్టల్ సెంటర్ డైరెక్టర్ గురు శ్రీ బాలరాజు ప్రపంచవ్యాప్తంగా పేరుగాంచిన సుప్రసిద్ధ కతోలిక గురువు దివంగత పునీత ఆంతోనీ వారు పండగ వేడుకలను గురువారం ఆదోని పట్టణంలోని రైలే ్వస్టేషన్ అవతల ఉన్న పునీత ఆంతోనీ అనాథాశ్రమ పాఠశాలలో పండగ వేడుకలు ఘనంగా నిర్వహించారు. అనాథ ఆశ్రమ డైరెక్టర్, కరస్పాండెంట్ ఫాదర్ రెవరెండ్ జాన్ డేవిడ్ ఆధ్వర్యంలో ఈ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆదోని డివిజన్ ప్రాంతంలోనే కాకుండా కర్ణాటక బళాలఠ్రి, రాయదుర్గం ప్రాంతాల నుంచి ఆంతోనీ వారి భక్తులు తండోపతండాలుగా కదిలివచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య ప్రసంగీకులుగా రెవరెండ్ ఫాదర్ బాలరాజు, ప్రధాన అర్చకులుగా రెవరెండ్ ఫాదర్ ఆవుల జాన్ దేవదాసు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పునీత పాదువాపుర ఆంతోనీ వారు అనేక అద్భుతాలు కలిగిన వ్యక్తిగా ప్రపంచవ్యాప్తంగా పేరు గాంచాడన్నారు. ఈ గురువు పేరుతోను పునీత ఆంతోనీ వారు పాఠశాలగా నామకరణణ చేశారన్నారు. ఈ సందర్భంగా గురువులు మాట్లాడుతూ పునీతాంతోని వారు ఒక అద్భుతమైన గురువుగా, గట్టి విశ్వసిగా, అపారమైన ద్రవ్యక్తి గలవారన్నారు. గురు జీవితంలో అనేక అద్భుతాలు, భోజనశాలలు అందించారన్నారు. ఈయన నేడు ఈ స్థాయిలో పునీతుడుగా అద్భుతమైన ఆంతోనీ వారుగా పేరుగాంచారంటే ఆయనలో దీనత్వం, వినయం, తగ్గింపు తనమే కారణమన్నారు. 1195లో ఆగస్టు 15వ తేదీన పోర్చుగల్ దేశంలో జన్మించడం జరిగిందని, చిన్నప్పటి నుంచి దేవుని యెడల అపారమైన భయం, భక్తి కలిగిన గురువు అన్నారు. 1220 సంవత్సరంలో గురువుగా అభిశక్తుడై మన దేశాల్లో కూడా దేవుని సేవలు అందించారని పేర్కొన్నారు. దేవుని యందు భయభక్తులు కలిగిన పునీత ఆంతోని వారు గొప్ప శక్తిని అపారమైన జ్ఞానాన్ని పొందడం జరిగిందన్నారు. ఒక సాధారణ మనిషిగా తననను తాను దేవునికి సమర్పించుకుని అపారమైన గొప్పశక్తిని దైవ జ్ఞానాన్ని పొందిన వ్యక్తి పునీత ఆంతోనీ వారు అని కొనియాడారు. తను సృష్టించిన దేవునికి ప్రథమ స్థానం ఇచ్చి నేడు ఉన్నతమైన మహోన్నతమైన వ్యక్తిగా, పునీతుడుగా పేరుగాంచడం సంతోషకరమన్నారు. అనంతరం గురువులు దివ్యబలి పూజలు సమరిం ంచారు. హాజరైన వేలాది మంది భక్తులకు భోజన వసతులు కల్పించారు. ఈ కార్యక్రమంలో కర్నూలు, నందికొట్కూరు విచారణ చెందిన ఎఫదర్ లోకదళ్ బాలయేసు, గల్లెల విజయ్‌కుమార్, రామదుర్గంకు చెందిన ఫాదర్ జోసఫ్‌కుమార్‌లతో పాటు 16 మంది గురువులు, కన్యస్త్రీలు తదితరులు పాల్గొన్నారు.

## జనసేన పార్టీ మరింత బలోపేతానికి కృషిచేస్తాం

**- జిల్లా కో-ఆర్డినేటర్ చింతా సురేష్‌బాబు**



**కర్నూలు విద్య, జూన్ 13, ప్రభాతవార్త :** జనసేన పార్టీ అభివృద్ధి కొరకు మరింత కృషిచేసామని ఉమ్మడి కర్నూలు జిల్లా కో-ఆర్డినేటర్ చింతా సురేష్ బాబు అన్నారు. జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ రాష్ట్ర మంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన సందర్భంగా చింతా సురేష్ బాబు మంగళగిరి పార్టీ కార్యాలయంలో జనసేన అధ్యక్షులు పవన్ కళా ్యణ్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో కూటమి అభ్యర్థుల గెలుపునకు కృషిచేసిన చింతా సురేష్‌బాబుకు జనసేన నాయకులకు, కార్యకర్తలకు పవన్ కళ్యాణ్ అభినందనలు తెలిపారు. ఈసందర్భంగా చింతాసురేష్ బాబు మాట్లాడుతూ జనసేన పార్టీ మరింత బలోపేతానికి కృషిచేయడం జరుగుతుందన్నారు. అనంతరం రాష్ట్ర మంత్రి ప్రమాణాస్వీకారం చేసిన నాదెండ్ల మనోహార్‌ను కలిసి పుష్పగుచ్చం ఇచ్చి శుభాకంక్షలు తెలిపారు.

## ప్రజా తీర్పును శిరసా వహిస్తాం




**కోడుమూరు,జూన్ 13, ప్రభాతవార్త :** నేడు జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పును శిరసా వహిస్తామని కోడుమూరు వైసీపీ నాయకులు సంద్య విక్రమ్ కుమార్ అన్నారు. గురువారం ఆయన విలేఖర్లతో ఎన్నికల ఫలితాలపై ప్రజలు ఇచ్చిన తీర్పుపై స్పందించారు. ప్రజా క్షేత్రంలో జరిగే ఎన్నికల సమరంలో గెలుపోటంలు సర్వసాధరణమన్నారు. గత ఐదేళ్ల పాలనలో వైకాపా ప్రభుత్వం ప్రజలకు అందించిన పథకాలన్నీ పారదర్శకంగా అందించిందన్నారు. నేడు అధికారం చేపట్టిన తెలుగు దేశం ప్రభుత్వం ప్రజలకిచ్చిన పథకాలను ప్రజలకు చేరేలా చూడాలని, ఈ పథకాల అమలుపై రాజకీయం చేస్తే తాము ప్రజల పక్షాన నిలబడి పోరాటం చేస్తామన్నారు. తాను గత 12 ఏళ్ల పాటు కోడుమూరు నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారంతో పాటు వారి నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండి వారికి అండగా నిలపడి తన వంతు సహకారం అందించానని గుర్తు చేశారు. ఇదే తొడ్పాటును ఎప్పటిల్లాగే కొనసాగిస్తానని ప్రజా సంక్షేమం కోసమే తమ ధ్యేయమన్నారు. సమావేశంలో డెవిడ్,సోషల్ మిడియా కన్వీనర్ సప్పాగు రాజు తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ డొనేషన్ వసూలు చేస్తున్న విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి

**- పేద, మధ్య తరగతి తల్లీదండ్రుల రక్తాన్ని పీలుస్తున్న కార్పొరేట్ విద్యాసంస్థలు**

**- చదువుని పేద విద్యార్థులకు అందని ద్రాక్షగా మారుస్తున్న ప్రయివేట్ పాఠశాలలు**




**ఆదోనిలీగల్, జూన్13, ప్రభాతవార్త;** అక్రమ డొనేషన్ వసూలు చేస్తున్న విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఖాజాకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఆదోనిలో రాయలసీమ అభ్యుదయ విద్యార్థి ఫెడరేషన్ (ఆర్‌ఏవీఎఫ్ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఖాజాకృష్ణ మాట్లాడుతూ ఆదోని పట్టణంలోని ప్రయివేట్ మరియు కార్పొరేట్ పాఠశాలలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా విద్యార్థి తల్లిదండ్రుల నుంచి వేలకు వేలు రూపాయలు ఫీజులు వసూలు చేస్తూ అడ్మిషన్ ఫీజు పేరుతో డొనేషన్లు సైతం వసూలు చేస్తూ పేద, మధ్యతరగతి విద్యార్థుల తల్లిదండ్రుల శ్రమని జలగల్లా పీలుస్తున్నారని ఆరోపించారు. అలాగే జీవోనంబర్1 ఉల్లంఘించి పాఠశాలల్లోని బుక్స్, బ్యాగ్స్, షూష్ అమ్ముతూ పాఠశాలల్ని వ్యాపార కేంద్రంగా మార్చారన్నారు. విద్యాశాఖ అధికారులు మాత్రం చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారన్నారు. ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు స్పందించకపోతే పెద్దఎత్తున ఆందోళనలకు పూనుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రవీంద్ర, సోమనాథ, వీరేష్ పాల్గొన్నారు.

## సేద్యపు ఎద్దుల బండ పోటీలు ప్రారంభం



**చాగలమర్రి ,జూన్ 13, ప్రభాతవార్త:** స్థానిక చాగలమర్రి పట్టణానికి సమీపంలో ఉన్న కట్టమీది దస్తగిరిస్వామి ఉరుసు మహోత్సవం సంధ్భంగా సేద్యపు ఎద్దుల బండ పోటీలను తెలుగుదేశం పార్టీ రాష్ట్ర మైనార్టీసెల్ ఉపాధ్యక్షులు ఎం.ఎస్.అన్సర్‌బాషా, జిల్లా మైనార్టీ నాయకుడు కొలిమి ఉసేన్‌వలి, దర్గా కమిటీ సభ్యులు ముల్లా మౌలాలిలు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా దర్గా కమిటీ సభ్యులు మౌలాలి మాట్లాడుతూ పోటీల్లో 16 జతలు పాల్గొన్నాయని మొదటి బహుమతి చక్రంబీడీ అధినేత, ప్రముఖ రియల్‌ఎస్టేట్ వ్యాపారి ముల్లా షబ్బీర్ అహమ్మద్ రూ.40వేలు, రెండవ బహుమతి రహంతుల్లా రూ.30వేలు, మూడవ బహుమతి కొలిమి షరీఫ్ రూ.20వేలు, నాల్గవ బహుమతి గాడి దాదాపీర్ రూ.15వేలు, ఐదవ బహుమతి కొలిమి ఉసేన్‌వలి రూ.10వేలు, ఆరవ బహుమతి శెట్టివీడు మహబూబ్ బాషా రూ.5వేలు, ఏడవ బహుమతి పీరమ్మగారి ఉసేన్‌వలి రూ.3వేలు, ఎనిమిది బహుమతు రూ.2వేలు అందజేయడం జరిగిందని దర్గా కమిటీ సభ్యులు తెలిపారు. ఉరుసు మహోత్సవం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ రమణయ్య గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

## దరఖాస్తు చేసుకున్న ప్రతివిద్యార్థికి సీటు కేటాయించాలి



**కర్నూలు విద్య, జూన్ 13, ప్రభాతవార్త :** కర్నూలు జిల్లాలో ధరఖాస్తు చేసుకున్న ప్రతి విద్యార్థికి గురుకుల పాఠశాలల్లో సీటు కేటాయించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి షాబీర్ బాష, జిల్లా ఉపాధ్యక్షులు ఎస్ శరత్ కుమార్‌లు డిమాండ్ చేశారు. గురువారం నగరంలో సీ క్యాంపు నందు ఉన్న గురుకుల కో-ఆర్డినేటర్ కార్యాలయం ముందు అందోళన నిర్వహించి అనంతరం కో-ఆర్డినేటర్ ఐ శ్రీదేవికి వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ కరువు కాటకాలతో కొట్టుమిట్టాడుతున్న కర్నూలు జిల్లా అత్యంత వెనకబడిన ప్రాంతమన్నారు. గత ఏడాది కేంద్ర బృందం కూడ కర్నూలు జిల్లాలో పర్యటించి జిల్లాలో విద్యా ప్రమాణస్థాయిలు చాల తక్కువగా ఉన్నాయని ప్రభుత్వానికి నివేదికలు అందజేసిన కూడ వాటిని పట్టించుకోకుండా గాలికివదిలేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లాలో నిరక్షరా స్యత ఎక్కువగా ఉందని దాన్ని తగ్గ్ంచడానికి ప్రభుత్వం విద్యాసంస్థలు నెలకొల్పడం ఎంతో అవసరం అనా ్నరు. జిల్లాలో ఉన్నప్రభుత్వ విద్యాసంస్థలైన గురుకుల, ఆదర్శ, కెజీబివి లాంటి విద్యాసంస్థల్లో సీట్లు పెంచకపోతే విద్యార్థులు మరియు తల్లిదండ్రులను కలుపుకొని ఏఐఎస్ఎఫ్ అధ్వర్యంలో అందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. అనంతరం కో-ఆర్డినేటర్ ఐ శ్రీదేవి మాట్లాడుతూ తప్పకుండా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సీట్లను పెంచేందుకు కృషిచేస్తానన్నారు. ఈకార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు అభి, అఖీల్, సాయి, రాహుల్, రమేష్, సుంకన్న, కళ్యాణ్ పాల్గొన్నారు.

## యూనివర్శిటిల్లో ఏడాదికి రెండుసార్లు అడ్మిషన్లు

**నంద్యాల విద్య, జూన్ 13, ప్రభాతవార్త:** ఈఏడాది 2024-25 విద్యాసంవత్సవరం నుంచి విదేశీ యూనివర్శిటిల తరహాలోనే విద్యార్థులకు ఏడాది రెండుసార్లు అడ్మిషన్లు ఇచ్చేందుకు దేశంలోని యూనివర్శిటిలు ఉన్నత విద్యాసంస్థలకు అనుమతి చ్చాయని యూజీసీ అధికారులు పేర్కొన్నారు. ప్రతి ఏడాది రెండు సార్లు అడ్మిషన్లు ఉంటాయన్నారు. జూలై, ఆగష్టు నెలల్లో ఒకసారి జనవరి, ఫిబ్రవరి మాసాల్లో మరొక్కసారి అడ్మిషన్లు జరుగుతాయన్నారు. భారతీయ విశ్వవిద్యాలయాలు ఏడాదికి రెండు సార్లు అడ్మిషన్లు ఇవ్వడం వల్ల విద్యార్థులకు ప్రయోజనం ఉంటుందన్నారు. ఎందుకంటే జూన్ ఆగష్టు సెషన్‌లో విద్యార్థులు చేరకపోయినా మరసటి ఏడాది వరకు వేచిచూడాల్సిన అవసరం ఉండదు. పలు కంపెనీలు క్యాంపస్ రిక్రూట్‌మెంట్‌లను ఏడాది రెండుసార్లు చేస్తాయి. దీంతో గ్రాడ్యుయేట్‌లకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. ఉన్నత విద్యాసంస్థల్లో విద్యార్థుల ప్రవేశాలను పెంచాలని యూనివర్శిటి గ్రాంట్ కమిషన్ ఈ అవకాశం ఇచ్చింది. అడ్మిషన్లుచేరికతో విద్యాసంస ్థల్లో అధ్యాపకులు, తరగతి గదులు, ల్యాబ్‌ల వంటి వాటిని సమకూర్చుకోవడానికి వంటి అవకాశాలు ఉంటాయి. యూనివర్శిటిలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని యూజీసీ అధికారులు తెలిపారు.

## పాఠశాలల్లో విద్యాప్రవేశ్ 90 రోజుల కార్యక్రమం నిర్వహించాలి

**- రాష్ట్ర ఉన్నతాధికారుల అదేశాలు**




**నంద్యాల విద్య, జూన్ 13, ప్రభాతవార్త:** విద్యాప్రవేశ్ అనేది ఓ పాఠశాల విద్యాసంసిద్ధత కార్యక్రమం దీనిని 90 రోజుల పాటు ప్రతి పాఠశాలలో నిర్వహించాలని రాష్ట్ర ఉన్నతాధికారులు అదేశాలు జారీచేశారు. పూర్వ ప్రాథమిక విద్యను పూర్తిచేసుకొని 1వ తరగతిలో చేరుతున్న విద్యార్థుల సామర్థ్యాల పెంపుకొరకు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రతిరోజు భాషాభివృద్ధి, జ్ఞానాభివృద్ధి, శారీరక అభివృద్ధికి సంబంధించిన మూడు కృత్యాలను విద్యార్థులచే సంబంధిత ఉపాధ్యాయులు చేయించాలి. విద్యప్రవేశ్‌కు సంబంధించి బేస్‌లైన్ పరీక్షను నిర్వహిస్తారు. ఎంఈఓలు, డిప్యూటి డిఈఓలు, డిఈఓలు సమీక్ష నిర్వహించాలని అదేశించారు. 90 రోజుల తరువాత ఎండ్‌లైన్ పరీక్ష నిర్వహించడం జరుగుతుంది. ఈవిద్యా ప్రవేశ్ కార్యక్రమాలు అమలుకు సంబంధించి ప్రతి పాఠశాలకు సంబంధిత నివేదికలు అందజేయాలని అధికారులను అదేశించారు.

## బక్రీద్ పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలి



**నందికొట్కురు,జూన్ 13,ప్రభాతవార్త:** నియోజకవర్గంలోని ప్రజలు బక్రీద్ పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని పట్టణ సి.ఐ.జి.ప్రకాష్‌కుమార్ తెలిపారు. గురువారం జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు స్తానిక పోలీసు స్టేషన్ ఆవరణంలో బక్రీద్ పండుగను సంధర్భంగా హిందూ, ముస్లీం మత పెద్దలతో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతు పట్టణంలో మత పెద్దలు పండుగ సంధర్భంగా ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండ చూచుకోవాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మత పెద్దలు పాల్గొన్నారు.

## ప్రభుత్వం మారింది

**- పాఠశాలలో వంటమనిషిని మార్చారు**

**కొలిమిగుండ్ల, జూన్ 13, ప్రభాతవార్త:** కొలిమిగుండ్ల మండల పరిధిలోని అంకిరెడ్డిపల్లి గ్రామంలో జిల్లా పరిషత్ ఉన ్నత పాఠశాలలో గతంలో పనిచేస్తున్న వంట మనిషిని మార్చి తమకు అనుకూలంగా ఉన్న టిడిపి కార్యకర్తలకు వంట చేసే బాధ్యతలు అప్పగిస్తున్నట్లు గ్రామ టిడిపి నాయకులు నిర్ణయాలు తీసుకుంటున్నారని విశ్వసనీయ సమాచారం.

## కొలిమిగుండ్ల మండలంలో పాఠ్యపుస్తకాలు పంపిణి



**కొలిమిగుండ్ల, జూన్ 13, ప్రభాతవార్త :** మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం రోజు పాఠశాలలు ప్రారంభం అయిన సందర్భంగా మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు 16,400 పాఠ్యపుస్తకాలు, 12,000 నోట్ పుస్తకాలు పంపిణి చేసినట్లు కొలిమిగుండ్ల ఎంఈఓ అబ్దుల్ కలాం తెలిపారు. ఈకార్యక్రమంలో ఎమ్మార్పీ సిబ్బంది, సిఆర్పీ కమల, మద్దిలేటి, అకౌంటెంట్ కాంతారావు, ఎంఐఎస్ అబ్దుల్ రహీనా, జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# చంద్రబాబు 4.0 సుపరిపాలన ప్రారంభం

## - ఐదేళ్ళ సైకో పాలనకు చరమగీతం
## -ప్రజా సంక్షేమమే టిడిపి ధ్యేయం
## -టిడిపి రాష్ట్ర కార్యదర్శి ఎవిఆర్ ప్రసాద్



**నంద్యాల, జూన్ 13, ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో ఐదేళ్ళ సైకో పాలనకు ప్రజలు ఓటుతో చరమగీతం పాడారని చంద్రబాబు 4.0 ప్రభుత్వ నాయకత్వంలో సుపరిపాలన ప్రారంభమయిందని టిడిపి రాష్ట్ర కార్యదర్శి ఎవిఆర్ ప్రసాద్ అన్నారు. విజయవాడలోని ప్రధాని నరేంద్రమోడీ ముఖ్య అతిథిగా రాష్ట్ర గవర్నర్ నజీర్ అధ్యక్షతన ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు 24 మంది మంత్రులుగా ప్రమాణస్వీకారోత్సవం అట్టహాసంగా జరిగింది. ప్రమాణస్వీకార కార్యక్రమానికి హాజరయిన ఎవిఆర్ ప్రసాద్, టిడిపి యువ నాయకుడు, ప్రజా గళం రూపకర్త నారా లోకేష్ రాష్ట్ర మంత్రులుగా ప్రమాణస్వీకారం చేసిన నంద్యాలకు చెందిన టిడిపి సీనియర్ నాయకుడు ఎన్ఎండి ఫరూక్, నిడదవోలు నుంచి జనసేన ఎమ్మెల్యేగా గెలిచిన కందుల దుర్గేష్, ప్రొద్దుటూరు టిడిపి ఎమ్మెల్యే ఎన్ వరదరాజులరెడ్డి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి ఎన్ కొండారెడ్డి తదితర ముఖ్య నాయకులను కలిసి వారికి అభినందనలు తెలియ జేయడం జరిగింది. జగన్ నేతృత్వంలో జరిగిన అరాచక దౌర్జన్యకర పాలనను చూసిన ప్రజలు భవిష్యత్తు కోసం కూటమిని భారీ మెజార్టీతో గెలిపించడం జరిగిందన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన వెంటనే ప్రజలకు ఇచ్చిన హామి మేరకు తొలి సంతకం మెగా డిఎస్సీ, రెండవ సంతకం ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దు తదితర ఐదు ఫైళ్ళపై సంతకాలు చేశారని తెలిపారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రతి హామిని కూటమి ప్రభుత్వం నెరవేరుస్తుందన్నారు. అవినీతి రహిత పాలన అందించడమే ధ్యేయంగా ప్రజాసంక్షేమ పాలన అందించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని ఎవిఆర్ ప్రసాద్ పేర్కొన్నారు.

# మంత్రిగా నగరానికి వస్తున్న టీజీకి ఘనస్వాగతం పలికేందుకు తరలిరండి



**నంద్యాల హాస్పిటల్, జూన్ 13, ప్రభాతవార్త :** కర్నూలు శాసన సభ్యులు టీజీ భరత్ రాష్ట్రమంత్రివర్యులుగా ప్రమాణస్వీకారం చేసి మొట్టమొదటి సారిగా నేడు కర్నూలు నగరానికి వస్తున్న సందర్భంగా నగరంలోని సుంకేసుల రోడ్డులో ఉన్న సెయింట్ జోషఫ్ కళాశాల వద్ద సాయంత్రం 4 గంటలకు ఘనస్వాగతం పలికిన అనంతరం ఊరేగింపు ర్యాలీ కార్యక్రమం ఉంటుందని జిల్లా ప్రజలు, తెలుగుదేశం పార్టీ వివిధ స్థాయిల రాష్ట్ర, జిల్లా, మండల, నగర, పట్టణ గ్రామ కమిటీ, సాధికార కమిటీలలో ఉన్న నాయకులు, వార్డు ఇంచార్జీలు, క్లస్టర్ యూనిట్ బూత్ ఇంచార్జీలు అభిమానులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొనాలని టిడిపి జిల్లా అధ్యక్షులు పి తిక్కారెడ్డి పిలుపునిచ్చారు. ఈర్యాలీ సెయింట్ జోషఫ్ కళాశాల, మున్సిపల్ ఆఫీసు, ఎస్‌బిఐ సర్కిల్, గాంధీనగర్, జిల్లా పరిషత్, రాజ్ విహార్ మీదుగా జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయం వరకు సాగుతుందని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## శ్రీ రాఘవేంద్రస్వామి సన్నిధిలో పెజావర్ మఠం పీఠాధిపతి





**మంత్రాలయం, జూన్ 13, ప్రభాతవార్త:** ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మంత్రాలయం శ్రీ రాఘవేంద్రస్వామి దర్శనార్థమై పెజావర్ మఠం పీఠాధిపతి శ్రీ విశ్వప్రసన్నతీర్థులు గురువారం మంత్రాలయం విచ్చేశారు. వీరికి శ్రీమఠం అధికారులు సాంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. శ్రీమఠం ఆనవాయితీ ప్రకారం ముందుగా గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకొని మంగళ హారతులిచ్చారు. అనంతరం శ్రీ రాఘవేంద్రస్వామి మూల బృందావనాన్ని దర్శించుకొని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. శ్రీమఠం ప్రాకారంలో తిరుగుతూ మొక్కులు తీర్చుకున్నారు. వీరికి పండిత కేసరి రాజా ఎస్ గిరియాచార్ శ్రీ రాఘవేంద్రస్వామి మెమెంటో, ఫల, పుష్ప, మంత్రాక్షితలతో ఆశీర్వదించారు. వీరివెంట మేనేజర్‌లు ఎస్‌కె శ్రీనివాసరావు, వెంకటేష్‌జోషి, అసిస్టెంట్ మేనేజర్ ఐపి నరసింహమూర్తి ,పిఆర్‌ఓ వ్యాసరాజాచారి, ద్వారపాలక అనంతస్వామి తదితరులు ఉన్నారు.

## జిల్లా సమస్యలు, అభివృద్ధిపై జిల్లా కలెక్టరు, ఎస్పీలతో చర్చించిన ఎంపీ



**కర్నూలు హాస్పిటల్, జూన్ 13, ప్రభాతవార్త :** కర్నూలు ఎంపీగా గెలుపొందిన బస్తిపాటి నాగరాజు జిల్లా ఉన్నతాధికారులను మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా కలెక్టరు డా.జి. సృజన, జిల్లా ఎస్పీ కృష్ణకాంత్‌లను కలిసి వారికి పుష్పగుచ్ఛాలు అందజేశారు. ఈసందర్భంగా ఎంపీ జిల్లాలో నెలకొన్న సమస్యలు అభివృద్ధిపై వారితో చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అన్నిశాఖల సమన్వయంతో జిల్లాను అభివృద్ధి పరుస్తామన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామిలకు కట్టుబడి ఉన్నానన్న ఎంపీ నాగరాజు కర్నూలు జిల్లాను అని వ్నవిధాలుగా ముందుకు తీసుకెళ్లి దశ దిశ మారుస్తానన్నారు.

## ఏపిఎంసెట్ ఫలితాల్లో శ్రీవిజ్ఞాన్ విద్యార్థుల ప్రభంజనం



**నందికొట్కూరు, జూన్ 13, ప్రభాతవార్త:** పట్టణంలోని శ్రీవిజ్ఞాన్ జూనియర్ కళాశాల విద్యార్థులు ఇటీవలే విడుదలైన ఏపిఎంసెట్, బైపిసి విభాగం నందు తమ ప్రతిభను చాటారు. బైపిసి నందు శివరాగిణి 13,657 ర్యాంక్, సి.పూజిత 17,635 ర్యాంక్, గీత 20,141 ర్యాంక్, జీవన్ 20,546 ర్యాంక్, పి.అఖిల 21,543 ర్యాంక్ సాధించగా, ఏపిఎంసెట్ నందు ఎస్.ఇర్ఫాన్ 20 వేలు ర్యాంక్, డి.సానియా21వేలు ర్యాంక్, కె.తారకలక్ష్మి 24వేల ర్యాంక్, అక్షయ 30 వేలు ర్యాంక్, భావన 38వేలు ర్యాంక్ సాధించినట్లుగా కళాశాల ప్రిన్సిపాల్ ఎం.ప్రసాద్, కరస్పాండెంట్ ఏ.గాంది తెలిపారు. ప్రతిభ చాటిన విద్యార్థులను కళాశాల డైరెక్టర్లు కె.పరమేష్, ఎస్.వినోద్, అధ్యాపక బృందం అభినంధించారు.

## లీకైన డ్రైనేజీనీరు.. ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు



**మంత్రాలయం, జూన్ 13, ప్రభాతవార్త:** ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మంత్రాలయం ఆర్‌టిసి బస్టాండ్ సమీపంలో గురువార ం డ్రైనేజీ నీరు లీకయ్యింది. లీకయిన డ్రైనేజీ నీరు ఆర్‌టిసి బస్టాండ్ ప్రాంగణంలోకి ప్రవహించింది. తద్వారా ప్రయాణికులు, శ్రీ రాఘవేంద్రస్వామి భక్తులు ఈ డ్రైనేజీ నీరు దుర్వాసనకు తీవ్ర ఇబ్బందలు పడ్డారు. గత వారంరోజుల క్రితం కూడా బస్టాండ్ సమీపంలోనే డ్రైనేజీనీరు లీకై బస్టాండ్‌లోకి వెళ్ళాయి. మంత్రాలయం అధికారులు పారిశుధ్య కార్మికులతో లీకైన డ్రైనేజీ నీటిని సరిచేశారు. అయితే మరోమారు ఈ డ్రైనేజీ నీరు లీకవడంతో ఏమి చేయాలో తెలియక అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి డ్రైనేజీ నీరు లీకవకుండా శాశ్వత పరిష్కారం చూపాలని ప్రయాణికులు, ప్రజలు కోరుతున్నారు.



## మద్యం దుకాణాల ఉద్యోగులకు న్యాయం చేయాలి




**కొత్తపల్లి, జూన్13, ప్రభాతవార్త :** రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం నిర్వహిస్తున్న మద్యం దుకాణాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు న్యాయంచేయాలని సుపర్వైజర్ శాలి సాహెబ్, సేల్స్‌మెన్లు మధుబాబు, వెంకటలింగమయ్యలు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ప్రభుత్వ మద్యం దుకాణం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2019లో అప్పటి ప్రభుత్వం ప్రైవేట్ మద్యం రద్దు చేసి సోంతంగా మద్యం దుకాణాలను ఏర్పాటు చేసిందన్నారు. అర్హతను బట్టి ఉద్యోగులను నియమించిందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 18 వేల మంది ఉపాధి పొందుతున్నారన్నారు. తెదెపా అధికారంలోకి రావాడంతో ప్రభుత్వ మద్యందుకాణాలు రద్దుచేసి పాత పద్ధతిలో ప్రైవేట్ వ్యక్తులకు టెండర్ల ద్వారా ఇచ్చేందుకు ప్రయాత్నాలు చేస్తుందన్న వదంతులు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఈ విధంగా ప్రైవేట్ వ్యక్తులకు అప్పగిస్తే మద్యం దుకాణాలలో పనిచేస్తున్న 18 వేలకుటుంబాలు రోడ్డున పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తంచేశారు. ప్రభుత్వం తమ విద్యార్హత, సినీయారిటిని పరిగణలోకి తీసుకొని మరో డిపార్ట్‌మెంట్‌కి సేవలను వినియోగించుకొని న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వాచ్‌మెన్‌లు హుస్సేన్ మియ్యా, మధుసుదన్ రెడ్డిలు పాల్గొన్నారు.

## మాజీ ఉప రాష్ట్రపతి, నూతన మంత్రిని కలిసిన విట్టా రమేష్

- ఆదోని నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని విన్నవించిన విట్టా రమేష్
- ఆర్యవైశ్యుల సంక్షేమానికి కృషి చేయాలని మంత్రి భరత్‌ను కోరిన విట్టా రేమష్



**ఆదోనిటౌన్, జూన్13, ప్రభాతవార్త;** ఎన్‌డీయే కూటమి ప్రభుత్వంలో నూతనంగా మంత్రి అయిన టి.జి.భరత్‌ను గురువారం విజయవాడలో బీజేపీ సీనియర్ నాయకులు, ప్రముఖ పారిశ్రామికవేత్త విట్టా రమేష్ కలిశారు. దుశ్వాలువాలు, బొకే అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఆదోని యోజకవర్గంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని విట్టా రమేష్ విన్నవించారు. అలాగే ఆర్యవైశ్యుల సంక్షేమానికి కృషి చేయాలని మంత్రి భరత్‌ను విట్టా రేమష్ కోరారు. ఈ సార్వత్రిక ఎన్నికల్లో ఎన్‌డీయే కూటమి అభ్యర్థుల గెలుపుకు నాయకులు, కార్యకర్తలు అహర్నిశలు శ్రమించారని చెప్పారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మంత్రి టి.జి.భరత్ హామీ ఇచ్చారన్నారు. అనంతరం మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడిని బీజేపీ సీనియర్ నాయకులు విట్టా రమేష్ కలిసి శాలువాతో సత్కరించారు. మీలాంటి సీనియర్ నాయకులు ఎన్‌డీయే కూటమి గెలుపులో భాగస్వాములు కావడం సంతోషంగా ఉందని కొనియాడారు. మీ సేవలు కొనసాగించాలని కోరారు.



## గిరినాథ్‌చౌదరి కుటుంబసభ్యులను పరామర్శించిన డోన్ ఎమ్మెల్యే కోట్లసూర్యప్రకాష్‌రెడ్డి



**వెల్దుర్తి, జూన్13, ప్రభాతవార్త :** మండలంలోని బొమ్మిరెడ్డిపల్లి గ్రామంలో జిల్లా తెదేపానాయకులు సుబ్బరాయుడు అన్న రామాంజనేయులు పెద్ద కుమారుడు తెదేపా నాయకుడు గిరినాథ్‌చౌదరి ఇటీవల వైకాపా వర్గీయుల చేతిలో హత్యకు గురైన విషయం తెలిసిందే. ఈ విషయం తెలుసుకున్న మాజీ కేంద్రమంత్రి, డోన్ ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాష్‌రెడ్డి గురువారం బొమ్మిరెడ్డిపల్లికి చేరుకున్నారు. సుబ్బ రాయుడు ఇంటికి వెళ్లి ఆయనను, గిరినాథ్‌చౌదరి తండ్రి రామాంజనేయులను పరామర్శించారు. ధైర్యంగా ఉండాలన్నారు. ఈ సందర్భంగా కోట సూర్యప్రకాష్‌రెడ్డి వెల్దుర్తి సర్కిల్ సిఐ మధుసూధన్‌రావుతో మాట్లాడుతూ హత్యకు సంబంధించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా తెదేపానాయకులు బొమ్మనశివశంకర్‌రెడ్డి, సుబ్బరాయుడు, నిడ్జూరు రాంభూపాల్‌రెడ్డి, మండల తెదేపా అధ్యక్షులు టి.ఇ.బలరాంగౌడ్, నాయకులు జయరాముడు, లక్ష్మిరెడ్డి, రామక్రిష్ణఆచారి, ఎరుకలచెరువు శివ, మధుసూధన్‌రెడ్డి, మాధవరావు, మల్లెపల్లి రమణారెడ్డి, అల్లుగుండు బాలమద్ది, దశరథుడు, శివ, కలుగోట్ల రామక్రిష్ణ, సుధాకర్‌గౌడ్, రాఘవేంద్రగౌడ్, అనసూర్యుడు, బాలాజీ మహేంద్ర, లక్ష్మణ్, మహేష్, రామచంద్రుడు తదితరులు పాల్గొన్నారు.

## పార్టి అదికారములోకి మొక్కుతీర్చుకున్న మాజీ మార్కెట్‌యాడు చైర్మన్ గడ్డం



**కోవెలకుంట్ల, జూన్ 12, ప్రభాతవార్త :** రాష్ట్రంలో తెలుగు దేశం పార్టి అదికారములోకి రావాలని ఎంతో మంది తమ ఇష్టదైవములను కోరుకున్నారు. అందులో బాగంగా కోవెలకుంట్ల మాజీ మార్కెట్ యాడు చైర్మన్ గడ్డం నాగేశ్వరరెడ్డి తన మొక్కు తీర్చుకున్నారు. గురువారము ఉదయము నారా లోకేఫ్‌తో పాటు గడ్డం నాగేశ్వరరెడ్డి తన మొక్కును దుర్గమ్మ గుడిలో తీర్చుకున్నారు అయనతో పాటు మండల తెలుగు యువత నాయుకలు గడ్డం అమరనాదరెడ్డి ఉన్నారు.

## టిడిపి నాయకున్ని పరామర్శించిన ఎమ్మెల్యే కోట్ల



**బేతంచెర్ల, జూన్ 13, ప్రభాతవార్త :** పట్టణంలోని రెండవ వార్డు టిడిపి ఇంచార్జీగా వ్యవహారిస్తున్న వెంకటేశ్వర ఆచారిని డోన్ ఎమ్మెల్యే కోట్ల జయ సూర్యప్రకాష్‌రెడ్డి గురువారం కర్నూలులో పరామర్శించారు. వెంకటేశ్వర ఆచారి ఇటీవల అనారోగ్యానికి గురయి కర్నూలు ఓ ప్రైవేట్ వైద్యశాల నందు చికిత్స పొందుతుండగా సమాచారం అందుకున్న కోట్ల జయ సూర్యప్రకాష్‌రెడ్డి అతని పరామర్శించి ప్రస్తుత ఆరోగ్యపరిస్థితిపై వైద్యులతో ఆరాతీశారు. మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. ఆయన వెంట టిడిపి ఎస్టీసెల్ కార్యదర్శి రవీంధ్రనాయక్ తదితరులున్నారు.